వాతావరణంలో మార్పుతో రైతుల్లో గుబులు

- ధాన్యం ఒబ్బిడిలో రైతులు నిమగ్నం
- చేపల చెరువుల్లో ఆక్సిజన్ శాతం తగ్గడంతో ఏరియేటర్లు తిప్పుతున్న వైనం



సీసలిలో కల్లంలో ధాన్యం ఆరబోస్తున్న రైతు

కాళ్ల: తుపాను కారణంగా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో మండలంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి చినుకులు పడి మధ్యాహ్నం కొంచెం తెరిపివ్వడంతో ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు రైతులు నిమగ్నమయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పంటను కాపాడుకునే పనిలో ఉన్నారు. కోత మిషన్లతో కోసిన ధాన్యాన్ని ఆరబెడుతూ పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండలంలో వేంపాడు ,కోపల్లె, జక్కరం, బొండాడ, సీసలి, కాళ్ల ,కాళ్లకూరు తదితర గ్రామాల్లో ముమ్మరంగా మాసూళ్లు చేపట్టారు. వాతావరణం అనుకూలించి మరో కొన్ని రోజులు వర్షాలు పడకుండా ఉంటే దాళ్వా పంటను కాపాడుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు. ఇంకొక వైపు వాతావరణం లో వచ్చిన మార్పులతో ఆక్వా రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆక్సిజన్ శాతం లోపంతో చేపలు, రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. దీనినుంచి గట్టెక్కేందుకు ఆక్వా చెరువుల్లో నిరంతరం ఏరియేటర్లు తిప్పుతున్నారు.

అకాల వర్షంతో రైతుల గుండెల్లో రైళ్లు

ఆకివీడు: మండలంలో అకాల వర్షంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రబీ పంటచేతికి అందివచ్చిన సమయంలో అకాల వర్షం వస్తుందని, నాలుగు రోజుల పాటు వర్ష సూచనతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో వేలాది ఎకరాల్లో వరి కోత దశకు వచ్చింది. చేలపై వరి కంకులు పూర్తిగా పండిపోయి ఉన్నాయి. చిరుగాలులు, చిరు జల్లులకే కంకుల నుండి ధాన్యం రాలిపోయే పరిస్థితి నెలకొంది. మరికొన్ని గ్రామాల్లో మాసూళ్లు పూర్తి చేసుకుని రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. ధాన్యం రాశులపై ఉంది. ఆదివారం ఉదయం మండలంలోని పలు గ్రామాల్లో కొద్ది నిమిషాల పాటు జల్లులు కురవడంతో రైతులు ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో మాసూళ్లకు సిద్ధంగా ఉన్న వరి చేలల్లో కోతలు కోయవద్దని మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక రైతులకు సూచిస్తున్నారు. వాతావరణం మరో రెండు మూడు రోజులు ఇలాగే ఉంటుందని, ఈ పరిస్థితుల్లో కోతలు కోయడం వల్ల ధాన్యం గట్లకు చేరవేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటివరకూ మండలంలో 1700 ఎకరాల్లో మాసూళ్లు పూర్తి అయ్యాయని, మండలంలో ఏడు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు.

ధాన్యం ఒబ్బిడికి రైతులు పరుగులు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి వరి రైతులు బెంబేలెత్తిపోయారు. మండలంలో గునుపూడి, యనమదుర్రు, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప గ్రామాలలో వరికోత యంత్రాలతో మాసూళ్లు జరుగుతున్నాయి. ఎండలు కాయడంతో కళ్లాలోనే ధాన్యం రాశులను ఉంచి ఆరబెడుతున్నారు. మిగిలిన గ్రామాలలో దాళ్వా పంట పక్వానికి వచ్చింది. ఈదురు గాలులతో అకాల వర్షం కురవడంతో రైతులు ఆరుగాలం కష్టపడిన పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులపై వెళ్లి టార్పాలిన్‌తో ధాన్యపు రాశులను కప్పారు. ఈదురుగాలులకు పొలాల్లోని కొన్ని చోట్ల వరి చేలు నేలమట్టమయ్యాయి. ఎకరానికి 50 బస్తాలు అవుతున్నాయనే ఆశలతో రైతులు ఉండగా ఈ అకాల వర్షం రూపంలో నష్టాలపాలు చేసిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రాతళ్లమెరకలో చెరువులో ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం



చినకాపవరంలో రాశుల్లో ఒబ్బిడి చేసిన ధాన్యం



యనమదుర్రులో ధాన్యాన్ని తరలిస్తున్న దృశ్యం



అనాకోడేరులో ఈదురుగాలులకు పడిపోయిన వరి చేలు

క్లుప్తంగా

రేపు పిల్లల గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారితోటలో అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో మంగళవారం సాయంత్రం పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ పిల్లలను పరిశీలించి అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 15 సంవత్సరాల లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30 నుంచి చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాలు

ఉండి: ఉప్పులూరులో వేంచేసియున్న చెన్నకేశవస్వామి కల్యాణమహోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ యర్రా వెంకట సుబ్బారావు ఆదివారం చెప్పారు. తొలిరోజు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మే 1న దివ్యతిరు కల్యాణం, 3న స్వామివారి ఎదురు సన్నాహం, 4న తెప్పోత్సవం, 5న రథోత్సవం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. 6వ తేదీన నిర్వహించే అఖండ అన్నసమారాధనతో కల్యాణోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల్లో విజేతకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం లూథరన్ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో భీమవరం ప్రిన్స్ జట్టు సీసలి జట్టుపై విజయం సాధించింది. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా విన్నర్ జట్టుకు రూ.లక్ష 20 వేలు, షీల్డ్, రన్నర్ జట్టుకు రూ.60 వేలు, షీల్డ్‌ను అందించారు. మెంటే పార్థసారథి, మద్దుల రాము, మెంటే వంశీ, మైలబత్తుల ఐజాక్ బాబు, గనిరెడ్డి త్రినాథ్, చెల్లబోయిన గోవింద్, కవురు పృధ్వీ శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా బసవేశ్వరుని జయంతి



దగ్గులూరులో చల్లా అన్నపూర్ణేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: దగ్గులూరులో కర్షభక్తుల ఆరాధ్యదైవం బసవేశ్వర స్వామి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బసవేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బసవేశ్వరస్వామి చరిత్ర పుస్తకం రచించిన చల్లా అన్నపూర్ణేశ్వరరావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం , ఎంపీటీసీ శాగ సత్యనారాయణ, చినగోపురం చైర్మన్ గాదె వెంకన్న, బీజేపీ నాయకుడు జక్కంపూడి కుమార్, సప్పరపు పార్వతీశం, వాసా లక్ష్మణకుమార్, చల్లా మల్లేశ్వరరావు, సమతం రమణ మహేష్, అందే కోటి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిథాంలో క్షీరాభిషేకం



వాసవీ శాంతి థాంలో 1108 లీటర్ల పాలతో వాసవీ మాతకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పెనుగొండ: అక్షర తృతీయ సందర్భంగా అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని పెనుగొండ వాసవీ శాంతి థాంలో వాసవీ మాతకు ఆదివారం 1108 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం నుంచి కర్ణాటక బెంగుళూరు నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు అభిషేకాలు, పంచామృతాభిషేకం, ద్వాదశ జ్యోతిర్లింగాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వయంగా అభిషేకం చేయడం విశేషం.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఆదివారం దాతలు, ఆర్యవైశ్యులు గ్రంధి సత్యనారాయణ, రత్నావతి దాత సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దాహార్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమానికి రూ.10,116 అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, జి.మాణిక్యాలరావు, సెక్రటరీ వంగపండు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, డీవీపీ విశ్వేశ్వరరావు, గరికపాటి బాపయ్యశర్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కాళ్ల: ప్రతి ఒక్కరు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బొండాడలో గ్రామ పంచాయతీ, భీమవరం అశోక్ కిడ్నీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరాన్ని పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా కిడ్నీ, లివర్ పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవాలన్నారు. గ్రామంలో పెద్ద ఎత్తున మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మన్నే నాగరాజు, వైద్యులు భూపతిరాజు అశోక్‌వర్మలను అభినందించారు. రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరంలో సుమారు 300 మంది రోగులకు వైద్యులు అశోక్ వర్మ, వి.సందీప్ కుమార్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా పీవీఎల్, వైద్యులు అశోక్‌వర్మ, పెనుమత్స విశ్వనాథరాజు, రామకృష్ణంరాజులను గ్రామ పెద్దలు మన్నే నాగరాజు, మన్నే శ్రీనివాస్, కందుల హనుమ, పెనుమత్స రంగరాజు తదితరులు సత్కరించారు.



బొండాడలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీవీఎల్

ఫ్రిజ్ దగ్ధం

ఉండి: ఉండి పెదపేటలో విద్యుత్ హైఓల్టేజ్ కారణంగా ఆదివారం కందుకూరి బాల అనే మహిళ ఇంట్లో ఫ్రిజ్ దగ్ధమైంది. పాల ప్యాకెట్ ఫ్రిజ్‌లో పెట్టేందుకు డోర్ తెరవగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సదరు మహిళ భయంతో పరుగులు తీయడంతో అదే సమయంలో చర్చి నుంచి ఇంటికి వస్తున్న స్థానికులు పరుగున వెళ్లి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. ఫ్రిజ్‌పై నీళ్లు పోసి మంటలార్పాడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిపీల్చుకున్నారు. ఒక్కోసారి విద్యుత్ సరఫరాలో హైఓల్టేజీ వస్తుండటం వల్లనే గృహోపకరణాలు కాలిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల కొందరి ఇళ్లల్లో ఇన్వర్టర్లు, ఇతర విద్యుత్ పరికరాలు కాలిపోయాయని తెలిపారు. ఈ విషయమై విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఉండి పెదపేటలో దగ్ధమవుతున్న ఫ్రిజ్

క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

వీరవాసరం: యువత వేసవిలో చెడు వ్యసనాలకు దూరంగా ఆటపాటలతో కాలం గడపాలని చింతలకోటి గరువు గ్రామ సర్పంచ్ దాసరి మహాలక్ష్మి అన్నారు. గ్రామంలో యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను ఆమె ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆటపాటలతో పాటు చదువులోనూ రాణించి జీవితంలో పైకి రావాలని ఆకాంక్షించారు. దాత దాసరి మాణిక్యాలరావు ఆర్థిక సహాయంతో సుమారు రూ.15 వేలు విలువైన కిట్లను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాకిలేటి బాసు, దాసరి తాతాజీ, దాసరి మాణిక్యాలరావు, పంజా రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

ఆకివీడు: మండలంలోని దుంపగడప శివారు ఉప్పుటేరు సమీపంలో జాతీయరహదారికి చేర్చి ఉన్న ప్రభుత్వ భూమి మెరక పనుల్ని ఆదివారం నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూముల్లో ఏ విధమైన పనులు చేపట్టరాదని ఆయన హెచ్చరించారు. ట్రాక్టర్ల ద్వారా మట్టి మెరక పనులను వీఆర్వోలతో నిలుపుదల చేయించామన్నారు.

26న వాహనాల వేలం

వీరవాసరం: వీరవాసరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో జప్తు చేయబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్సై పి.రమేష్ ఆదివారం చెప్పారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల అభ్యర్థులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

వీరవాసరం: బలుసుగొయ్యిలపాలెం గ్రామం శివారు రాజులుగరువులో కోత బంతి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై పి.రమేష్ ఆదివారం చెప్పారు. వీరి నుంచి రూ.76,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా లక్ష్మీ కుబేర వ్రతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆదివారం నిత్యార్చనలు, గణపతి పూజ, లక్ష్మీ అష్టోత్తర పూజలు, కుబేరవ్రతం నిర్వహించారు. అర్చకులు మంగిపూడి సీతారామయ్య, మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

మేడే నిర్వహించాలి

తణుకు: మేడేను కార్మికులు వాడవాడలా నిర్వహించి అరుణపతాకాలు ఆవిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. ఏఐటీయూసీ తణుకు ఏరియా సమితి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యక్షులు బొద్దాని నాగరాజు, సీపీఐ తణుకు ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



లూథరన్ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళన దృశ్యం

సాక్షి, భీమవరం: 'ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో' అంటూ ఆనాటి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. పట్టణంలోని లూథరన్ హైస్కూల్ 2002–2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 20 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కువైట్‌లో కొమ్ముచిక్కాల వాసి మృతి

పోడూరు: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వ్యక్తి అక్కడ మృతి చెందడంతో పోడూరు మండలం కొమ్ముచిక్కాల శివారు ఏఎస్ఆర్ కాలనీలో విషాదం నెలకొంది. మృతుని కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమ్ముచిక్కాల శివారు ఏఎస్ఆర్ కాలనీకి చెందిన తండా చార్లెస్(40) 5 ఏళ్ల కిందట ఉపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లాడు. అతనికి భార్య బేబి, కుమారులు రవి, సుధీర్‌లు ఉన్నారు. రవి 9వ తరగతి, సుధీర్ 7వ తరగతి చదువుతున్నారు. ఉపాధి నిమిత్తం వెళ్లిన చార్లెస్ అక్కడ ఒక షేట్ దగ్గర డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా చార్లెస్ అక్కడ గుండెపోటుతో ఈ నెల 18న మృతి చెందాడు. ఈ విషయాన్ని అక్కడి సేట్ కొమ్ముచిక్కాలలోని చార్లెస్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. చార్లెస్ తల్లి వజ్రమ్మ, సోదరి అన్నామణి కూడా అదే దేశంలో ఉన్నారు. వారి ద్వారా సమాచారం తెలుసుకున్న అక్కడి తెలుగువారు చార్లెస్ భౌతికకాయాన్ని స్వదేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. వారి చొరవతో ఆదివారం మధ్యాహ్నం చార్లెస్ భౌతిక కాయం స్వగ్రామమైన కొమ్ముచిక్కాలకు చేరుకుంది. తల్లి, సోదరి కూడా భౌతికకాయంతో పాటు స్వగ్రామానికి వచ్చారు. ఆదివారం చార్లెస్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

పెంటపాడు గ్రామదేవతల జాతరకు ఏర్పాట్లు

పెంటపాడు: మే 6 నుంచి పెంటపాడు గ్రామ దేవతలైన పెంట్లమ్మ, కొర్లపాటి వెంకమ్మల జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఏడేళ్లకు ఒకసారి నిర్వహించనున్న జాతర మహోత్సవాలకు సంబంధించి ఇటీవల ఆలయ కమిటీ సమావేశంలో కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక పెంట్లమ్మ పూరిగుడి వద్ద ప్రత్యేక పూజల అనంతరం వారు మాట్లాడుతూ ఉత్సవాలకు సంబంధించి వివరాలు వెల్లడించారు. జాతరలో భాగంగా తొలిరోజైన శనివారం తెల్లవారుజామున పొలిమేర కట్టి అమ్మవారికి గరగ మొక్కులు, చలిమిడి పానకాలు సమర్పిస్తామన్నారు.7వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలు, అమ్మవారిని అత్తారింటికి పంపడం, పూరిగుడి పండించడం, సాయంత్రం వార్షిక పొన్నులు, రాత్రికి సంగంమేడ వద్ద నున్న గర్భగుడి వద్ద మొక్కుల చెల్లింపు, నైవేద్యాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలు సజావుగా సాగేలా గ్రామస్తుల సహకారం ఉండాలని కోరారు. 7 ఏళ్లకోసారి అమ్మవారికి జాతర, మూడేళ్లకు ఒకసారి అమ్మవారి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. కమిటీ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కొవ్వూరి లక్ష్మణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సత్తి నర్సిరెడ్డి, కార్యదర్శిగా చామన విజయకుమార్, కొవ్వూరి నాగవెంకటబాల భాస్కరరెడ్డి, శీలంశెట్టి రామచంద్రరావు, చామన వీరవెంకట సురేష్, వెలగల శ్రీనివాసరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వరికోతలు వాయిదా వేయండి

అత్తిలి: వాతావరణ అధికారుల సూచనల మేరకు రాగల రెండు రోజుల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నందున రైతాంగం వరి కోతలు రెండురోజుల పాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్తిలి మండలంలో వరికోతలు ఇప్పుడే ముమ్మరంగా చేపట్టారని, వాతావరణ మార్పులతో వర్షం పడడంతో వరిమాసూళ్లు ఆపాలని చెప్పారు. మండలంలో ఎక్కువగా ఎంటీయూ –1121 రకం సాగు చేశారని, ఇది పడిపోయే గుణంలేనిదని, కాబట్టి 2–3 రోజుల పాటు కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని బరకాలతో కప్పి, వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాలని చెప్పారు. పొరపాటున ధాన్యం తడిస్తే ఉప్పు ద్రావణం 5 శాతం పిచికారీ చేసుకుని ఆరబెట్టుకుంటే మొలక రాదని, రంగుమారదని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది త్వరితగతిన రైతుల నుంచి ధాన్యం సేకరించే విధానాన్ని వేగవంతం చేసి, కేటాయించిన ధాన్యాన్ని మిల్లులకు పంపే ఏర్పాట్లు కూడా యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు ఏఓ రాజేష్ వివరించారు.

విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు



యలమంచిలిలంకలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న గుణ్ణం నాగబాబు

యలమంచిలి: విద్య ద్వారా మాత్రమే సమాజంలో మార్పు, గుర్తింపు వస్తుందని నమ్మి, నిరూపించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవితం నేటికీ మనందరికీ అనుసరణీయమని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ కవురు శ్రీనివాస్ అన్నారు. యలమంచిలి లంక గ్రామంలోని రాంజీ నగర్‌లో ఆదివారం జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆయన స్థానిక దళిత సంఘాల నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం శిఖరాగ్ర స్థాయిలో ఉన్న రోజుల్లో అనేక అవమానాలను ఓర్చుకుని అంబేడ్కర్ ఉన్నత చదువులు చదవడం వలనే రాజ్యాంగాన్ని రచించే అవకాశం పొందారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాత కావడం వల్లే మన దేశంలో నేడు బడుగు, బలహీన, దళిత, అట్టడుగు వర్గాల ప్రజలు శాంతి సౌఖ్యాలతో జీవిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానికుల కోరిక మేరకు శ్మశాన వాటికకు రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు లక్ష్మీపాలెం, యలమంచిలిలంక గ్రామాల మధ్య నక్కల కాల్వపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీపీ రావూరి వెంకటరమణ సర్పంచ్‌లు చిలుకూరి సుబ్బారావు చౌదరి, పాలంకి శ్రీనివాసరావు, కవురు గోపి, పొన్నమండ నాగరాజు ఎంపీటీసీ సభ్యులు డేగల సూర్యప్రభ, ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ సొసైటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, నాయకులు ఇసుకొండ రవి, ఉచ్చుల స్టాలిన్, వల్లభు రంగబాబు, చీకటపల్లి మంగరాజు, ఉన్నమట్ల కబర్ధి, ముడకల గోపాలరావు, మురాల అమృతరావు, జగతాడి గంగరాజు, దంపనబోయిన వెంకటరత్నం, బద్దే రాజభూషణం పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలతో నడుచుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఒక్కరేనని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు తెలిపారు. స్థానిక పెదపేట అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ 132వ జయంతి కార్యక్రమం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాగబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ నేటి యువతరం విద్యార్థులందరూ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ముందుగా అంబేడ్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవతట్ల ఆనంద్ దంపతులు పేదలకు ఏర్పాటు చేసిన చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నమట్ల కబర్ధి, వైఎస్సార్ పార్టీ నాయకులు గుణ్ణం సురేష్, గాది ఆంజనేయులు, ఎల్ ఖగరాజు, సంఘ సభ్యులు దేవతట్ల అబ్బులు, పంబ బాలాజీ, పంబ నానిబాబు, పంబ నతానియేలు, దేవతట్ల జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సువార్త కూడికలు

పెంటపాడు: గూడెంలోని కడకట్ల క్రైస్తమాస్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో క్రీస్తు రక్షణ సువార్త కూడికలు నిర్వహించనున్నట్లు సభల కన్వీనర్ బుంగా విద్యాసాగర్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్ ఇమ్మానియేలు మినిస్ట్రీస్‌కు చెందిన పాస్టర్ జెర్మియా ఈ సభలలో దేవుని వాక్యం అందిస్తారన్నారు. గూడెం ఫ్లైఓవర్ బ్రిడ్జి, సబ్‌స్టేషన్ వద్ద ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశాలను క్రైస్తవ భక్తులు, విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా స్త్రీల ఆదివారం

మొగల్తూరు: స్థానిక పంచాయతీలోని పాలకమ్మచెరువులో క్రీస్తు లూథరన్ చర్చిలో ఆదివారం స్త్రీల ఆరాధనా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పడవల మేరీ, సంఘ సేవకురాలు నేతల కుమారి స్టీఫెన్‌లను సంఘస్తులు సన్మానించారు. ఎస్ఆర్ ఎన్.స్టీఫెన్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

12 మంది వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 12 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం వైద్యులు హుస్సేన్ అహ్మద్, సుంకవల్లి రామకృష్ణ సంచార వైద్యశాల ద్వారా తణుకు , సజ్జాపురం, మండపాక ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 12 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పైడిపర్రుకు చెందిన అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.